ప్రజాశక్తి
శనివారం 23 సెప్టెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

జిల్లాలో 33 ప్రాంతాల్లో
బీచ్‌ల అభివృద్ధికి శ్రీకారం

బ్లూఫాగ్ గుర్తింపుతో పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలోని సముద్ర తీరప్రాంతంలో 33 చోట్ల బీచ్‌లను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేయడం ద్వారా మరింతగా ఆదాయ వనరులు సమకూరుతాయని భావిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లకు పర్యాటకులు అత్యధికంగా వస్తుంటారు. వీటికి బ్లూ ఫాగ్ గుర్తింపును పొందితే అనేక రకాల అంతర్జాతీయ వసతులతో పాటు స్వదేశీ, విదేశీ పర్యాటకుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. పర్యాటకులు కూడా తమకు సురక్షితమైన బీచ్‌లుగా భావించినట్లయితే వారు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో వచ్చేందుకు బ్లూ ఫాగ్ గుర్తింపు దోహదపడుతుంది. దీని ద్వారా టూరిజం, ట్రావెల్ మరియు హాస్పిటాలిటీ విభాగాలలో ఉద్యోగ అవకాశాలతో పాటు, ఆదాయ వనరులు పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో సూర్యలంక బీచ్‌తో పాటు సూర్యలంక పొగరుబీచ్, కృపానగర్‌బీచ్, పాండురంగాపురం, అడవిపల్లె పాలెం, రామచంద్రాపురం బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు. చీరాల వాడరేవు, కొత్త వాడరేవు బీచ్‌లను, చినగంజాం మండలంలో మోటుపల్లి, రుద్రమాంబాపురంతో ▶ 2లో

నీటి సరఫరా బిల్లులకు
సిఎం గ్రీన్‌సిగ్నల్

మెయిన్ 5లో

నేడు ఒంగోలుకు సిపిఎం పాదయాత్ర

- నగరంలో భారీ ర్యాలీ..
- కలెక్టరేట్ వద్ద ధర్నా
- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సంతనూతలపాడు నియోజకవర్గంలో సిపిఎం బృందానికి అర్జీలిస్తున్న ప్రజలు

వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ప్రకాశం జిల్లా వెనుకబడినట్లు గుర్తించాలని, జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలనే డిమాండ్లతో సిపిఎం జిల్లా నాయకత్వం చేపట్టిన పోరుబాట పాదయాత్ర శనివారం ఒంగోలుకు చేరుకోనుంది. ఈ సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారు. పాదయాత్ర ఈ నెల 10న దొనకొండలో ప్రారంభమైంది. మాజీ ఎంపీ పి.మధు యాత్రను అక్కడ ప్రారంభించిన సంగతి తెలిసిందే. అక్కడ నుంచి పశ్చిమ ప్రాంతంలో పలు మండలాల్లో పర్యటించారు. సుమారు 14 రోజుల పాటు 300 కిలోమీటర్లు నడిచారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి నేతృత్వంలో ఈ యాత్ర సాగుతోంది. జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ యాత్రను పర్యవేక్షిస్తూ సాగారు. పాదయాత్రకు గ్రామాల్లో మంచి స్పందన వచ్చింది. ఎటువంటి ఆర్భాటాలూ లేకుండా సాగిన యాత్రను గ్రామాల్లో పేదలు ఆదరించారు. స్వాగతాలు పలికారు. సిపిఎం, ప్రజాసంఘాల పోరాటాల వల్ల లబ్ధిపొందిన వర్గాలు గ్రామాల్లో పూలతో స్వాగతం పలికారు. పలు చోట్ల పట్టణాల్లో జనం నేతలకు స్వాగతం పలికి.. వారి వెంట ర్యాలీలో నడిచారు. అన్ని విధాలా సిపిఎం నేతలకు సహకరించారు. ఇక పాదయాత్రలో అనేక సమస్యలు నేతల దృష్టికి వచ్చాయి. అనేక వర్గాల ప్రజానీకం వారి సమస్యలను అర్జీల రూపంలో యాత్రలోని బృందానికి ఇచ్చారు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలు, భూముల సమస్యలు, అసైన్‌భూముల ఆక్రమణలు, కబ్జాలు, పేదల ఇళ్లస్థలాలు, జగనన్న కాలనీల్లో సమస్యలు, ఇసుక కొరత, నిర్వాసితులు ▶ 2లో

ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయండి: సిపిఎం

సిపిఎం పోరుబాట పాదయాత్ర ముగింపు సందర్భంగా శనివారం ఒంగోలులో జరిగే ప్రదర్శన, ధర్నాలో ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని 300 కిలోమీటర్లు సిపిఎం పోరుబాట పాదయాత్ర చేస్తోందన్నారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా శనివారం ఒంగోలులో ప్రదర్శన, ధర్నా జరుగుతుందన్నారు. ప్రదర్శన, ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలియచేశారు. ఒంగోలు, కర్నూల్‌రోడ్డు బైపాస్ సెంటర్ నుండి ప్రదర్శన ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, స్థానిక కలెక్టరేట్ వద్ద 11 గంటలకు ధర్నా జరుగుతుందని తెలిపారు. ప్రదర్శన, ధర్నాలో ప్రజలు, పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల మార్గదర్శకాలను పాటించని
అధికారులపై చర్యలు తీసుకోవాలి

- చట్టాలను ఉల్లంఘిస్తూ ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నారు..
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి టిడిపి ఎమ్మెల్యేల ఫిర్యాదు

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి అర్జీ ఇస్తున్న టిడిపి ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఓటరు సవరణ ప్రక్రియలో ఎన్నికల మార్గదర్శకాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరించిన పర్చూరు నియోజకవర్గ అధికారులపై విచారణ జరిపి.. తగు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవి కుమార్, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కొందరు అధికారులు అధికార పార్టీ నేతలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నికల మార్గదర్శకాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. కొందరి ఒత్తిడి కారణంగానే అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా వారినే కొనసాగిస్తున్నారని అన్నారు. అధికార పార్టీ నేతలు పథకం ప్రకారం తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు కుట్రలు పన్నారని, నియోజకవర్గవ్యాప్తంగా కొందరు అక్రమార్కులు కావాలనే అధిక సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు చేశారని గతంలో ఎన్నికల కమిషన్‌కు వివరించామని పేర్కొన్నారు. అసలైన ఓటరు ప్రమేయం లేకుండానే తమ ఓటు తొలగించాలంటూ వారి పేరుతో కొందరు అక్రమార్కులు దరఖాస్తు చేశారని, దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఓట్ల తొలగింపు దరఖాస్తుల విచారణలో ఎన్నికల అధికారులు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించడం లేదన్నారు. క్షేత్రస్థాయి విచారణలో ఇష్టానుసారంగా వ్యవహరించిన జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అతని సహాయకులపై తక్షణమే విచారణ జరిపి..తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్చూరు నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్నికల మార్గదర్శకాలను పాటించకుండా, చట్టాలను ఉల్లంఘిస్తూ ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఓటర్ల నమోదు నిబంధనలలోని 17వ నిబంధన ప్రకారం బల్క్ దరఖాస్తులను తిరస్కరించాలని ఎన్నికల అధికారులను పలుమార్లు కలిసి విన్నవించామన్నారు. కుట్ర పూరితంగా బల్క్‌గా ఫారమ్-7 దరఖాస్తు దాఖలు చేసిన వ్యక్తులను గుర్తించి విచారించాలని కోరినట్లు తెలిపారు. మోసపూరితంగా కుట్రకు పాల్పడిన వారిపై అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఓట్ల తొలగింపు వ్యవహారంపై తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు కూడా పర్చూరు నియోజకవర్గంలో జరిగిన అక్రమాలను ప్రస్తావిస్తూ.. గతంలో భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను కలిశారన్నారు. అర్హులైన ఓటర్లకు ఓటు హక్కును తొలగించేలా బల్క్ ఫారం-7 దరఖాస్తులను దాఖలు చేయడంపై అభ్యంతరం ▶ 2లో

అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజలు అర్జీ ఇస్తే..
ముఖ్యమంత్రి ఇచ్చినట్లే భావించాలి

అధికారులకు కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశం

మెయిన్ 5లో

కళాకారులపై కేసు..సిపిఎం ఖండన

ప్రజాశక్తి-బాపట్ల

గంగయ్య

బాపట్ల సముద్ర తీరంలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సైకత శిల్పం వేశారని కొంతమంది కళాకారులపై బాపట్ల పోలీసులు కేసులు పెట్టడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వెంటనే కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్య భావప్రకటనా స్వేచ్ఛను హరించడమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాలను అణిచివేసే నిరంకుశ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వెలిగండ్ల

అంగన్‌వాడీలకు కనీస వేతనం పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 25న విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయా లని కోరుతూ శుక్రవారం వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమావేశం అధ్యక్షురాలు ఎక్కంటి రాధమ్మ అధ్యక్షతన జరిగింది. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ గత 48 సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు గ్రామీణ, పట్టణ మురికివాడల్లో నివసించే పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన గర్భిణులు, బాలింతలు, సున్నా నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ నిర్దిష్ట ఉద్దేశాలు నెరవేర్చే దిశలో అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారని అన్నారు. తెలంగాణ కంటే రూ.1000 ఎక్కువ ఇస్తానని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ నెరవేరలేదని పేర్కొన్నారు. పైగా వివిధ రకాల యాప్స్‌తో మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నామన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీని అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మినీ సెంటర్లన్నీ తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. సమస్యలపై సూపర్‌వైజర్లు కమల కుమారి, కృపావరంలకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకురాలు ధనలక్ష్మి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాయల మాలకొండయ్య, వెలిగండ్ల అంగన్‌వాడీ ప్రాజెక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి ముక్కు మహాలక్ష్మమ్మ, రెడ్డం తిరుపతమ్మ, గోరేముచ్చు సలోమి, లలితమ్మ, పద్మావతి, టి ప్రమీల, ఎస్‌వి శ్రీలక్ష్మి, సుధారాణి, సరస్వతమ్మ, టి అరుణ, ఎం మమత, అనిశెట్టి నారాయణమ్మ, ఎస్‌కె షరీఫా, డి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ

నేడు ఒంగోలుకు సిపిఎం పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలు, వలసలు, ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు, అంగన్‌వాడీల సమస్యలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వెతలు, దళితులు, వెనుకబడిన తరగతుల సమస్యలు, ఫ్లోరిన్ సమస్యలు, కిడ్నీల వ్యాధులు, విద్య, వైద్య రంగాల్లోని సమస్యలపై అర్జీలు అందాయి. వాటిని పరిష్కారం చేయాలని నేతలు ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులను కూడా సమస్యలపై స్పందించి పరిష్కారం చేయాలని కోరారు. దొనకొండ వద్ద పరిశ్రమల కేంద్రం ప్రతిపాదిత ప్రాంతం నుంచి మొదలైన యాత్ర వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలను సందర్శించింది. నిర్వాసితుల సమస్యలపై అధ్యయనం చేసింది. ప్యాకేజీలు అందలేదని నిర్వాసితులు గోడు వెళ్లబోసుకున్నారు. మార్కాపురం పట్టణంలో బహిరంగ సభ నిర్వహించారు. వెలుగొండను పూర్తిచేయాలని ఇక్కడ ప్రధాన డిమాండుగా పెట్టారు. సాగునీరు, తాగునీటి సమస్యల పరిష్కారానికి వెలుగొండ వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్కడ నుంచి కనిగిరి నియోజకవర్గంలోనూ పలు మండలాల్లో పర్యటించారు. ఇక్కడ తాగునీటి సమస్య ప్రధానంగా ముందుకు వచ్చింది. పీసీపల్లిలో కిడ్నీల వ్యాధిగ్రస్తులు తమ సమస్యలను వెళ్లబోసుకున్నారు. కొండపి నియోజకవర్గంలో పొన్నలూరు, కొండపి మండలాల్లో పర్యటించారు. సంగమేశ్వర ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండు చేశారు. అక్కడ నుంచి సంతనూతలపాడు నియోజకవర్గంలో పాదయాత్ర సాగింది. శనివారం నాడు ఒంగోలుకు చేరుకోనుంది. నగర శివార్లలో పాదయాత్ర బృందానికి ఘనస్వాగతం పలికేందుకు కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తారు.

బీచ్‌ల అభివృద్ధికి శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

పాటు మరో ఆరు బీచ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిజాంపట్నం మండలంలో హార్బర్ బీచ్, దిండి బీచ్‌లతో పాటు మరో నాలుగు బీచ్‌లను అభివృద్ధి చేయనున్నారు. వేటపాలెం మండలంలో రామాపురం బీచ్‌తో పాటు కటారివారిపాలెం, పొట్టిసుబ్బయ్య పాలెం సహా మరో ఆరు బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. రేపల్లె మండ లంలో పెనుమూడి ఘాట్, కామరాజుగడ్డ ఘాట్‌లను అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు బీచ్‌లను మరింత అభివృద్ధి చేసే విషయమై పర్యాటకశాఖ, రెవెన్యూ శాఖ, బ్లూ ఫ్లాగ్ ఆర్కిటెక్ బందాలు ఇటీవల సూర్యలంక, రామాపురం బీచ్‌లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో 1500 మీటర్ల మేర సముద్రతీర భౌతిక పరిస్థితి, అక్కడి మత్స్యకారుల జీవనస్థితి వారికి అనుకూలమైన వ్యాపార వ్యవహారాల గురించి పరిశీలన చేశారు. రానున్న కాలంలో దేశంలో ఉన్న బీచ్‌లలో అత్యంత అనువైన బీచ్‌లుగా జిల్లాలోని రామాపురం మరియు సూర్యలంక బీచ్‌లు రూపొందనున్నాయి. ఇక్కడి ఇసుక, సముద్ర తీరం విదేశీయులను ఆకట్టుకుంటాయని భావిస్తున్నారు. ఇందుకోసం అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు కల్పించడం, నీటిలో ఆటల కోసం పరికరాలు, వినోదాల వసతులు ఏర్పాటు చేయనున్నారు. సందర్శకుల వినోదానికి బోటు షికారు, ఈత కొలను, వాటర్ స్పోర్ట్స్, రోలింగ్, స్కేటింగ్, చిల్డ్రన్స్ పార్కు, స్నానపు గదులు, ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. మత్స్యకారులకు తగిన మార్కెట్ సౌకర్యం కల్పించడం, మత్స్య సంపద ప్రదర్శనకు స్థానికంగా షాపులు ఏర్పాటు చేయడం చేస్తారు. జిల్లాలో సముద్రతీర ప్రాంతంలో ఉన్న పురాతన ఆలయాలకు నూతన శోభ వచ్చేలా చేయనున్నారు.

వి.బైలులో గణేష్ నిమజ్జనం

ప్రజాశక్తి-సిఎస్ పురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఐదు రోజుల పాటు గ్రామాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వి.బైలు, చెన్నపునాయుని పల్లి, డీజీ పేట, సిఎస్ పురంలోని వడియరాజుల నగర్, మిట్టపాలెం, కోవిలంపాడు గ్రామాలలో పాటు మరికొన్ని గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ, బాణాసంచా కాల్చి ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఎస్ఐ అనిల్‌కుమార్ తమ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేస్తూ ఈఆర్‌ఓకు వినతి పత్రం అందించేందుకు ఓటర్లు ప్రయత్నిస్తే ఆయన తిరస్కరించారన్నారు. కొందరు వ్యక్తులు ఫారం-7 దరఖాస్తులకు తమకు సంబంధం లేదని ఏఈఆర్‌ఓకు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేశారని తెలిపారు. తమ ప్రమేయం లేకుండా కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఫారం-7 దరఖాస్తులు చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి రిప్రజెంటేషన్‌లను కూడా దరఖాస్తుదారులు అందజేసినట్లు ఎన్నికల అధికారి దష్టికి టిడిపి ఎమ్మెల్యేలు తీసుకెళ్లారు. అయినా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఓటర్లకు పెద్దఎత్తున నోటీసులు జారీ చేసి.. విచారణ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. మోసపూరితంగా, అన్యాయంగా తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపు లక్ష్యంగా చేపట్టిన ఈ కుట్రపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఓటర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. తక్షణమే స్పందించి ఫారం-7 దరఖాస్తులు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, బూత్ స్థాయి అధికారులతో సహా ఇతర అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరారు.

కారుమంచి దళిత కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న మల్లవరపు రాఘవరెడ్డి

పార్టీ పటిష్టతకు కలిసి నడుద్దాం

వైసిపి మండల అధ్యక్షులు రాఘవరెడ్డి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు అందరం కలిసే ముందుకు సాగుదామని వైసిపి నూతన మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తన స్వగ్రామం కారుమంచి గ్రామం నుండే అధిష్టానం తనకు అప్పజెప్పిన పనిని రాఘవరెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని దళిత కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. దళిత కాలనీ యువకులు, పార్టీ సానుభూతిపరులతో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి వారి నుంచి పలు సలహాలను కూడా ఆయన స్వీకరించారు. గ్రామస్తులు ఎలాంటి అవసరమైనా నేరుగా తనను సంప్రదించవచ్చునని, నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ వరికూటి అశోక్ బాబు సహకారంతో గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి తన శక్తికి మించి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఐకమత్యంతో పనిచేసి వరికూటి అశోక్‌బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలన్న లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు మేడికొండ కోటేశ్వరరావు, మన్నం కాశీరావు, ధర్నాసి బ్రహ్మయ్య, మేడికొండ సుబ్బారావు, దగ్గుమాటి కోటేశ్వరరావు, బత్తుల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి.

ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బత్తుల అంజయ్య తండ్రి నాగయ్య కు చెందిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. నేను బత్తుల తిరుపతయ్య గారి వద్ద కొనుగోలు చేసి పీమకుర్తి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీస్ నందు దస్తావేజు నంబర్ : 345/ 1989 గా రిజిస్టర్ చేయించుకున్న ఒరిజినల్ డాక్యుమెంట్లు తేది:13 -09-2023న పోయినవి. ఈ సదరు దస్తావేజులు దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసిందిగా కోరు చున్నాము. ఇవి దొరికిన వారు మాకు అందజేసిన యెడల వారికి తగిన పారితోషికం ఇవ్వగలవారము.

ఇట్లు
బత్తుల అంజయ్య, తండ్రి నాగయ్య
ధర్మవరం గ్రామం, మర్రిపూడి మండలం
ప్రకాశం జిల్లా - 523270.
సెల్ : 9948798972.

ప్రకటన
మహారాజశ్రీ కృష్ణా జిల్లా గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.250/2019

Between:-
గంటా ప్రమీల ...వాది
మరియు
తుల్లిమిల్లి బేబీ సరోజిని మరియు ఐదుగురు ...ప్రతివాదులు

గంటా ప్రమీల గారు వారి బంధువులైన తుల్లిమిల్లి బేబీ సరోజిని, అన్నె కృష్ణా రావు, అన్నె శ్రీనుబాబు మరియు అన్నె హరిబాబులపై పూర్వీకుల ఆస్తిలో వాటా పంపకము కొరకు పై నంబరు దావా వేయుట జరిగినది. దరిమిలా గుంటూరు జిల్లా, బాపట్ల నివాసస్తులైన అన్నె కృష్ణా రావు వారి చనిపోవుట వలన ఆయన వారసులుగా వారి భార్య అయిన అన్నె లక్ష్మిరాణి గారిని 5వ ప్రతివాదిగాను మరియు వారి కుమార్తె అయిన అన్నె పూజా ప్రదీప్‌ను 6వ ప్రతివాదిగాను సదరు పై గ్రంథమునందు చేర్చడమైనది. శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం 5 మరియు 6వ ప్రతివాదులకు నోటీసులు, దావా సమన్లు బాపట్ల పంపగా 5వ ప్రతివాది అయిన లక్ష్మిరాణి గారు అందుకొన్నారు. కానీ అచటనే ఉంటున్న సదరు 6వ ప్రతివాది అయిన పూజా ప్రదీప్ అందుకోనకుండా తప్పించుకొని కాలయాపన చేయుచున్నారు. ఆ విధముగా అనేక పర్యాయములు పంపించుట జరిగి చివరకు వాది కోరిక మేరకు శ్రీ కోర్టువారు పేపరు నందు ప్రకటనకు అనుమతి యిచ్చినారు. సదరు పై గ్రంథము ది.30-09-2023వ తేదీకి 6వ ప్రతివాది యొక్క హాజరుకు వాయిదా అయివున్నది. కనుక సదరు 6వ ప్రతివాది అయిన అన్నె పూజా ప్రదీప్ గారు ది.30-09-2023వ తేదీన కృష్ణా జిల్లా లోని గన్నవరంలో గల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో హాజరు అయ్యి సదరు పై గ్రంథము నందు వారి యొక్క వాదనలు శ్రీ కోర్టు వారికి తెలుపుకొనవలెను. అట్లు కాని ఎడల 6వ ప్రతివాది అయిన అన్నె పూజా ప్రదీప్ గారికి పరోక్షంగా తీర్మానం జరుగును.

ఇట్లు
ఆదిరెడ్డి గోవిందరావు,
వాది తరుపు న్యాయవాది.

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
OS No: 32/2022.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఇంకొల్లు బ్రాంచి రి.బై ఇట్స్ బ్రాంచి మేనేజర్ .... వాది
V/s
కొడమల నాగేశ్వర రావు వగైరా........ ప్రతివాదులు
To
D2) కొడమల లాజరు @ రాజు S/o భాస్కరరావు
D3) కొడమలభద్రయ్య S/o వెంకటేశ్వర్లు
D5), కత్తి సురేష్ S/o వెంకటయ్య
All are r/o కొణికి- కట్టావారిపాలెం (Po), ఇంకొల్లు (MD) ,బాపట్ల (Dt).

దావా సమను

పై నెంబరు దావాలో మీ హాజరు నిమిత్తం ది. 27/09/2023 తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు తేదీన ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టు నందు హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేయవచ్చును. లేని ఎడల మీ పరోక్ష మందు విచారించి దావాను తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ:27-09-2023
స్థలం : పర్చూరు ఇట్లు
మండవ వీరాంజనేయులు
వాది తరపు న్యాయవాది.

మహారాజశ్రీ ఒంగోలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెంబర్ 1185/2022

చిట్టాల సంజీవరెడ్డి .... వాది
మరియు
బొమ్ము హేమంత్ .... ప్రతివాది
To
బొమ్ము హేమంత్, తండ్రి మాలకొండయ్య వయస్సు 36 సం, సూపర్ వైజర్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, త్రోవగుంట గ్రామం, ఒంగోలు కార్పొరేషన్, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా పంపిన నోటీసులు తీసుకోనందున మీకు నోటీసు జారీ చేయు నిమిత్తం తేది 04-10-2023 కు వాయిదా వేసి మీకు నోటీసును పేపరు ప్రకటన ద్వారా తెలియపరచవలసిందిగా ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున మీరు పై తెలిపిన వాయిదా తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషాలకు పై తెలిపిన కోర్టులో స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలసినది లేని యెడల మీ పరోక్షమున దావాను విచారించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //
ఒంగోలు
తేది 22.09.2023 ఇట్లు
సానికొమ్ము రామిరెడ్డి
వాది తరుపు న్యాయవాది
ఒంగోలు ప్రకాశం జిల్లా
సెల్: 8977227701

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.ఎ నెం.1088/2021 ఇన్
ఐ.ఎ.నెం.1037/2021 ఇన్
ఓ.ఎస్.నెం.618/2021

జంగిటి @ తోరి లక్ష్మీదేవి ....పిటీషనర్/ప్లైయింటిఫ్
వర్సెస్
జంగిటి రంగస్వామి మరియు ఇతరులు ....రెస్పాండెంట్స్/డిఫెండెంట్స్
టు:
ఆర్2/డి2: మార్లల శారద భర్త సుబ్రహ్మణ్య రెడ్డి, వయస్సు:59సంIIలు, ఆర్/ఓ.6వ వార్డు, యాదవ బజారు,గిద్దలూరు గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై కోర్టులో పిటిషనర్/ప్లైయింటిఫ్ మీపై పిటిషన్/దావా దాఖలు చేసి ఎన్ని సార్లు మీకు నోటీసులు/సమన్లు పంపినను మీకు ముట్టియుండ నందున నోటీసులు/సమన్లు నిమిత్తం తేది : 04-10-2023 న వాయిదా వున్నది. వాయిదా రోజు ఉదయం 10:30 నిIIలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు ఆక్షేపణలుంటే తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు //
వాయిదా తేది:04.10.2023
దుగ్గరాజు అనంతరామయ్య,
కామిశెట్టి నాగలక్ష్మి
పిటీషనర్/ప్లైయింటిఫ్ తరుపు న్యాయవాదులు
గురజాల, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పథకాలపై ప్రచారమేదీ..?

- అవగాహన లేక నష్టపోతున్న కార్మికులు

- పట్టించుకోని అధికారులు

పనులు చేస్తున్న కూలీలు

ప్రజ్శాక్తి-యర్రగొండపాలెం

అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అమలు చేయడంలో రాష్ట్రం ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని వారు చెబుతున్నారు. కార్మికుల కోసం తెచ్చిన పథకాలపై అధికారులకే పూర్తి స్థాయి అవగాహన లేని పరిస్థితి ఉందంటున్నారు.

పనిచేయలేని వారికి సాయం..

భవన నిర్మాణ కార్మికులకు ఏడాది పాటు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2 లక్షల పరిహారం అందే అవకాశముంది. ఇలాంటి పథకాలున్నాయని సంబంధిత శాఖ అధికారులు ప్రచారం చేపట్టడం లేదు. దీంతో ఎంతో మంది అర్హులు పథకాల లబ్ధి పొందలేక పోతున్నారు. ప్రమాదంలో గాయపడి కూలి పని చేయలేని వారికి వారి ప్రాంతాన్ని బట్టి కొంత ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ఎంత కాలం వారు పనిచేయలేక చికిత్స పొందుతారో అంతకాలం వారికి సహాయం అందించే వెసులుబాటు ఉంది.

మార్కాపురం డివిజన్‌లో ఇలా...

యర్రగొండపాలెం, మార్కాపురం, త్రిపురాంతకం, పెద్ద దోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు,కురిచేడు, తర్లుపాడు, దొనకొండ మండలాల పరిధిలో 1,29,501 మంది కార్మికులు ఉన్నారు. వీరిలో 57,068 మంది అసంఘటిత రంగ కార్మికులు పలు సంఘాల్లో సభ్యులుగా నమోదై ఉన్నారు. వీరంతా ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్నారంటే.. ఎంత మందికి అవగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కార్మిక శాఖ అధికారులు ఇప్పటికైనా దీనిపై గ్రామ స్థాయిలో కార్మికులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలనికార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

కాంక్రీటు పనులు చేస్తున్న కూలీలు

యర్రగొండపాలెంకు చెందిన కె.సుబ్బారావు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇనుప చువ్వలను విద్యుత్తు యంత్రంతో కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలికి గాయమైంది. దీంతో నెల రోజులపాటు పనికి వెళ్లలేదు. ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈయన తన పేరును ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకుని ఉంటే.. సంబంధిత కార్మిక శాఖ కార్యా లయం ద్వారా ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేది.

అర్హతలు ఇవే...

- పథకంలో చేరేందుకు 18 నుంచి 50 సంవత్సరాల లోపు వయసుగల వారై ఉండాలి.
- ఆదాయపు పన్ను చెల్లించనివారై ఉండాలి.
-అసంఘటిత రంగ కార్మికుల కేటగిరీలో పని చేస్తూ ఉండాలి.
- చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలు, పాడి పరిశ్రమ, ఉమ్మడి వ్యవసాయదారులు, తాపీ, తవ్వకం, రాళ్ల కొట్టేవారు, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ ప్లంబింగ్, శానిటరీ, ఇటుక, పెయింటింగ్ సున్నం బట్టీలు, ఇలా వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారు అర్హులు.

కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం

మేకల భూపాల్, సహాయ కార్మిక అధికారి, మార్కాపురం

అసంఘటిత రంగకార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే అన్ని పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కార్మికులు పేర్లను ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకునేందుకు వారి గ్రామాల్లోని సచివాలయాల్లో సంప్రదిస్తే సరిపోతుంది.

అధికారులు దృష్టిసారించాలి..

భూమని వెంకటేశం, వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు

కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రవేశపెట్టిన వివిధ పథకాల గురించి గ్రామ స్థాయిలో కార్మికులకుతెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో రోజువారీ వేతనదారులుగా పని చేస్తున్న ప్రతిఒక్కరూ ఈ-కార్డులు పొందేందుకు అర్హులు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సగం మంది కూడా ఈ-శ్రమ్ పోర్టల్లో తమ పేర్లు నమోదు చేసుకోలేదు.

సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి-మార్కాపురం

ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకొచ్చిన 150 బాటిళ్ల మద్యాన్ని సెబ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సూపరింటెండెంట్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. అందులో భాగంగా పట్టణంలోని సప్తగిరి లాడ్జి అండర్ గ్రౌండ్‌లో శ్రీవెంకట శివ నెట్ షాపులో పుదుచ్చేరికి 72 మద్యం బాటిళ్లుపశ్చిమ బెంగాల్‌కు చెందిన 78 మిలటరీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యానికి సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో షాపు యజమాని ఉమ్మారెడ్డి తిరుపతిరెడ్డిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, మద్యం తరలించేందుకు ఉపయోగిస్తున్న ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సిఐ రాఘుమై, ఎస్ఐ పద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న ఇంటి గోడ

అదుపు తప్పి దూసుకెళ్లిన లారీ...

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కనిగిరి నుంచి ఒంగోలు వైపు టమోటా లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి ఓ ఇంటి ఆవరణలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని చిన్నారికట్ల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో సుబ్బయ్య అనే వ్యక్తి ఇంటి గోడలు కూలిపోయాయి. డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

చెప్పుల దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి బాపట్ల

అగ్ని ప్రమాదంలో ఓ చెప్పుల దుకాణం దగ్ధమైంది. దీంతో రూ.5లక్షల మేర నష్టం వాటిల్లింది. బాపట్ల అగ్నిమాపక అధికారి వై. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... బాపట్ల పాత బస్టాండ్ వద్ద ఉన్న అంజుమన్ మసీద్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ దుకాణంలో షేక్ అంజాద్ అనే వ్యక్తి చెప్పుల దుకాణం నిర్వహించుకుంటున్నాడు. గురువారం రాత్రి చెప్పు దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో రూ. 5 లక్షల మేర నష్టం వాటిల్లింది.

రూ.53 వేలు పలికిన వినాయకుడి లడ్డూ

ప్రజాశక్తి - గిద్దలూరు

వినాయక చవితి పండుగ సందర్భంగా గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని 10వ వార్డు శర్మ వీధిలో శ్రీ జువ్విళ్ల బావి వద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయకుడి లడ్డూ ప్రసాదానికి శుక్రవారం వేలం పాట నిర్వహించారు. మొట్ల వెంకటరామిరెడ్డి కుమార్తె మొట్ల షణ్ముఖ అంజలి రూ.53 వేల రూపాలయకు వేలం పాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని మురారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి. ఆంజనేయులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన టాబ్‌లను పరిశీలించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ట్యాబ్‌లను విద్యా విషయాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం కెరీర్ గైడెన్స్‌పై ఉపాధ్యాయులకు ,విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ప్రతి శుక్రవారం రెండోవ పిరియడ్ విద్యార్థుల భవిషత్తుకు భరోసా "కెరీర్ గైడెన్సీ" కోసం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మురారిపల్లి ఇన్‌ఛార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంఎన్‌పి ఎం.శ్రీకాంత్, సిఆర్‌ఎంటి యల్లయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-పుల్లలచెరువు

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డిఇ సురేష్ బాబు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. హౌసింగ్ డే సందర్భంగా పుల్లలచెరువు-2 సచివాలయ పరిధిలోని జగనన్న కాలనీ లేఅవుట్ లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ సురేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పేదలకు ఇళ్ల పథకంలో పురోగతి సాధించాలన్నారు. నిర్ధేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధకారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేధికలు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ పుల్లలచెరువులోని జగనన్న కాలనీలో నీటి వసతి లేదన్నారు. అధికారులు స్పందించి నీటి వసతి విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తే ఇళ్లను గట్టిగా నిర్మించుకుంటామని తెలిపారు. ఈ విషయంపై అధికారులు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు తెలియజేసి పంచాయతీ తీర్మానం ద్వారా నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటి కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మరియదాసు, డిఆర్‌డిఎ ఎపిఎం వెంకటయ్య, హౌసింగ్ ఎఇ జాన్ సుందర్, సచివాలయం ఇంజినీరింగ్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు గురిజేపల్లిలో ' గడప గడపకూ'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని గురిజేపల్లిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు కొప్పర్తి చిన్న ఓబుల రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక ,పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని తెలిపారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ముఖ్యంత్రి వైఎస్ .జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు కావాలింది జిపిఎస్ కాదని ఒపిఎస్ అని తెలిపారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఒవి.వీరారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగికి ఇష్టం లేని జిపిఎస్‌ను బలవంతంగా తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దీన్ని వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీరాములు, ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు కీర్తి, యుటిఎఫ్ నాయకులు ఝాన్సీపాల్, బేబిరాణి, డి.కాశింసాహెబ్, పిసి.వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గడప గడపకు కార్యక్రమంలో వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్య

గడప గడపకూ.. కృష్ణచైతన్య

ప్రజాశక్తి - సంతమాగులూరు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అవినీతికి తావు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు శాప్ నెట్ చైర్మన్, వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య తెలిపారు. మండలంలోని పత్తేపురం గ్రామంలో మొదటిరోజు గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించు కునేందుకు ప్రతి ఒక్కరు అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. సర్పంచి గుమ్మా హరికృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, బండి కోటిరెడ్డి, వెంకట్రావు, అట్లా పెద్దవెంకటరెడ్డి, కొల్లి వెంకటరావు, ఇప్పల మునసాలరెడ్డి, ఒరుగంటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

గణేష్ మండపంలో ఎంఎల్ఎ ఏలూరికి ఘన సత్కారం

ఎంఎల్ఎ ఏలూరికి సత్కారం

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని గన్నవరంలో తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద స్థానిక ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు శుక్రవారం ప్రత్యేక పూజలు చూశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కొద్దిసేపు మాట్లాడారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. అందరూ ఒక్కచోట చేసి ఉత్సవం చేసుకోవడం మంచి పరిణామమని అన్నారు. పూజ అనంతరం మండపం నిర్వాహకులు ఎంఎల్ఎను శాలువాతో సత్కరించారు.

అన్నదానం చేస్తున్న సివిఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు

సీవీఆర్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

పట్టణంలోని కుమ్మరామకట్ట సెంటర్ మరియు పొదిలి, కొండపల్లి గ్రామంలో వినాయక చవితి పురస్కరించుకుని సీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు వేల మంది భక్తులకు సీవీఆర్ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుమారుడు చేరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇలాంటి పండుగ ఉత్సవాల్లో ప్రజలకు అన్నదానం చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, గోపవరం రంగస్వామిరెడ్డి, బండారు ఆదిలక్ష్మి, గురురెడ్డి, (ఎల్‌ఐసి) అవినాష్‌రెడ్డి, అద్దంకి మోహన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

25న అంగన్వాడీల మహా ధర్నా

సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ

ప్రజాశక్తి - బాపట్ల

అంగన్వాడీల సమస్యలపై ఈ నెల 25న విజయవాడలో జరిగే మహా ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన అంగన్వాడీల మహాధర్నా సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. దశాబ్దాల నుండి గ్రామీణ, పట్టణ మురికివాడల్లో నివసించే పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన గర్భవతులు, బాలింతలు, సున్నా నుండి 6ఏళ్ళలోపు పిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీల జీతాలు పెంచడం, గ్రాట్యుటీ ఇవ్వటం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తోందని అన్నారు. కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అన్నిరకాల ధరలు పెరుగుతున్నా తమ వేతనాలు మాత్రం తరగడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. తెలంగాణా కంటే రూ.ఒకవెయ్యి అదనంగా వేతనం ఇస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసిడిఎస్ పిడికి అందజేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రేఖ, ప్రాజెక్ట్ నాయకులు శైలశ్రీ, సీత,హేమ పాల్గొన్నారు.

నిజాంపట్నం : అంగన్వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ, పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 25న విజయవాడలో ధర్నా జరుగుతుందని పల్లపట్ల ప్రాజెక్టు సిడిపిఒకు సిఐటియు ఆధ్వర్యంలో అంగనవాడీ కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొంటున్నట్లు తెలియ జేస్తూ వినతి పత్రంలో పేర్కొన్నారు. అంగనవాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వై మేరీమణి, ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతు గతంలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ తెలంగాణా కన్న అదనంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యుటీని తక్షణమే అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని మినీ సెంటర్లన్ని మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్, వివిధ రకాల యాప్‌లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరి రిటైర్మెంట్ వయసు 62సంవత్సరాలుకు పెంచాలన్నారు. ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. గ్యాసు ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని కోరారు. పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. నాణ్యమైన సరుకులు ఖచ్చితమైన కొలతలతో ప్రతినెల 5వ తేదీలోపు సెంటర్లకు అందించాలన్నారు. పోలీసులు ద్వారా అక్రమ అరెస్టుల, నోటీసులు ఇచ్చి నిర్బంధం ప్రయోగిస్తే తగ్గిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమావేశంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ

సిడిపిఒకు వినతి పత్రం ఇస్తున్న అంగనవాడీ కార్యకర్తలు సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్

ప్రాణాంతకంగా మారుతున్న ఈత సరదా

- తల్లిదండ్రులకు ఆవేదన మిగుల్చుతున్న యువత
- మద్యం మత్తులో ఈతకు దిగి మృత్యువాత పడుతున్న వైనం
- నిరంతర పోలీసు భద్రతే ప్రాణాలకు రక్షణ

లైఫ్ జాకెట్ల సహాయంతో కొట్టుకుపోతున్న మహిళను కాపాడిన మెరైన్ పోలీసులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - బాపట్ల

సముద్ర స్నానాల ఈత సరదాతో యువత పట్టుతప్పి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తీరంలో నిరంతరం పోలీసు భద్రతే ప్రాణాలకు రక్షగా నిలుస్తోంది. రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ఈత సరదా ఆందోళన కలిగిస్తోంది. క్షణాల్లో జరిగే సంఘటనలతో అనేక కుటుంబాలను కలవరపెడుతున్నాయి. యువకుల ఈత సరదా తల్లిదండ్రులకు గుండెజారుతోంది. జీవితమే గల్లంతవుతోంది. ఈత సరదా బాధితులకు ఇప్పుడు భద్రత వ్యవస్థ ముందడుగు వేస్తూ కొండంత అండగా నిలుస్తున్నారు. ప్రమాదాల్లో చిక్కుకున్న వారికి పునర్జన్మను ప్రసాదిస్తోంది. దీనిపై ప్రజాశక్తి సంక్షిప్త కథనం.

ఇటీవల యువత ఈత సరదాలు ప్రాణాపాయ స్థితికి దారి తీస్తున్నాయి. ప్రతి ఏటా ఈత సరదాల వల్ల సుమారు 2వేల మంది వరకు మృత్యువాత పడుతున్నారని అధికార గణాంకాలు చెప్తున్నాయి. నదులు, కాలువలు, పర్యాటక కేంద్రాలు, సూర్యలంక వంటి సుప్రసిద్ధ సముద్ర తీర ప్రాంతాల్లో విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. అనేక మంది ఈత సరదాతో మృత్యువాత పడుతున్నారు. మరి కొంతమంది మృత్యువు అంచు కెళ్ళి ప్రాణాలతో బయటపడుతున్నారు. తీర ప్రాంతాల్లో పహరా కాసే పోలీసులు, గజ ఈతగాళ్ళ సాహసం చేసి సముద్రంలో కొట్టుకెళ్తే వారిని రక్షిస్తున్నారు. ఒక్క బాపట్ల జిల్లా సూర్యలంక సముద్ర తీరంలోనే ఇటీవల కాలంలో వందలాది మందిని కాపాడారు. కొన ఊపిరితో ఉన్న అనేక మందిని తీరానికి తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స అందించారు. వృద్ధులు, మహిళలను సైతం ఇక్కడి గజ ఈతగాళ్ళు ప్రాణాలకు తెగించి కాపాడుతున్నారు. ఇందులో 90శాతంపైగా యువకులే ప్రమాదంలో చిక్కుకుంటున్నారు. సముద్ర స్నానమాచరించే పరిధి దాటి కెరింతలు కొడుతూ సముద్రపు అలల్లో చిందులేస్తూ కొట్టుకెళ్తేవారు కొందరైతే, మద్యం మత్తులో మరికొందరు సముద్రంలో కొట్టుకెళుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఒకరిని కాపాడబోయి మరొకరు, వారిని కాపాడబోయి మరో ఇద్దరు ఇలా వరుసగా మృత్యువాత పడిన సంఘటనలు బాపట్ల సూర్యలంక సముద్ర తీరంలో అనేకం ఉన్నాయి. తాజాగా పోలీసులు తీసుకుంటున్న ముందస్తు జాగ్రత్తలతో ఇప్పుడు అనేక మంది పర్యాటకులు కొన ఊపిరితో బయటపడ గలుగుతున్నారు.

సముద్రంలో గల్లంతయ్యే వారిని కనిపెట్టి పోలీసులు, గజ ఈతగాళ్లు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. కొట్టుకెళ్తే కదలికలు కనిపిస్తే వెంటనే అప్రమత్తమవుతు న్నారు. లైఫ్ జాకెట్లతో శర వేగంగా దూసుకెళ్లి రక్షిస్తున్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షణలో ఇక్కడ నిరంతరం పర్యవేక్షణ కోసం పోలీస్ వాచ్ టవర్లను ఏర్పాటు చేశారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండేలా గజ ఈతగాళ్ళు, మెరైన్ పోలీసులను సిద్ధం చేశారు. దీని ఫలితంగా మూడు నెలల కాల వ్యవధిలో సముద్ర అలల్లో కొట్టుకు వెళ్తున్న 150 మంది పర్యాటకులను కాపాడగలిగారు. రెండు తెలుగు రాష్ట్రాల పర్యాటకులతో నిత్యం కిటకిటలాడే సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకులపై నిఘా భద్రత పూర్తిస్థాయిలో అమలు జరుగుతోంది. గతంలో సముద్ర తీరంలో పరిధి దాటి స్నానమాచరించే పర్యాటకులు పొరపాటున కొట్టుకెళ్తే అంతే సంగతులు. ఇప్పుడు నిఘా వ్యవస్థ, అడుగడుగునా గజ ఈతగాళ్ళ నిరంతర పర్యవేక్షణ ఫలితంగా ప్రమాదాలు తగ్గాయి. మెరైన్ పోలీసులు నాయుడు శ్రీనివాసరావు, నాగరాజులు పర్యాటకులను కాపాడటంలో సాహసోపేతంగా వ్యవహరిస్తున్నారు. గజ ఈతగాళ్ళు ప్రాణాలకు తెగించి పర్యాటకులను కాపాడుతున్నారు. వారి కృషిని గుర్తించి పోలీసులు, ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అవతలి వాళ్ళ ప్రాణాలను కాపాడటమే పోలీసుల లక్ష్యంగా పనిచేస్తూ ప్రాణదాతలుగా ప్రజల నీరాజనాలు అందుకుంటున్నారు. ప్రతి సందర్భంలో ఎస్పీ వకుల్ జిందాల్ చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసలు అందుకుంటున్నారు. మద్యం సేవించిన యువకులే అధిక శాతం సముద్ర స్నానాలకు దిగి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్నారు. సముద్ర స్నానానికి విచ్చేసే యువకులు మద్యం సేవించడాన్ని అరికట్టే వ్యవస్థను పోలీసులు కనిపెట్టాల్సిన అవసరం ఉంది.

నిమజ్జన సమయాల్లో జాగ్రత్తలు అవసరం

గణేశ నిమజ్జనాలు గురువారం నుండి ఆరంభమయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చేందుకు బాజా, భజంత్రీలతో పర్యాటకులు నదీ, సముద్ర జలాల్లో నిమజ్జనం చేస్తున్నారు. యువకులు అత్యుత్సాహంగా గణేశ నిమజ్జన సమయంలో అప్రమత్తంగా లేకపోతే పరిస్థితులు చేజారుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నిమజ్జనాల నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ యువత బాధ్యతగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలి. తాజాగా సూర్యలంక తీరంలో గణేశ విగ్రహం నిమజ్జనానికి విచ్చేసిన నలుగురు మహిళలు సముద్రపు అలల్లో కొట్టుకుపోవడాన్ని గమనించిన పోలీసులు కాపాడగలిగారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు సముద్ర స్నానాలు, నిమజ్జన సమయాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

యువకున్ని కాపాడిన మెరైన్ పోలీసులు (ఫైల్‌ఫోటో)

యువకున్ని ఒడ్డుకు తెస్తున్న మెరైన్ పోలీసులు (ఫైల్ ఫోటో)

ఫలితమివ్వని 'ముటుకుల'

- పేపర్‌పై నీళ్ళిచ్చినట్లు లెక్కలు
- మరమ్మతుల పేరుతో కోట్లు ఖర్చు
- కాంట్రాక్టర్లకు, అధికారులకు

వరంగా మారిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకు

ప్రాజెక్టు ఏర్పాటు చేసిన సంపు

ఫిల్టర్ బెడ్లు

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో సురక్షిత జలాలను అందించే ఉద్దేశ్యంతో 2008లో అప్పటి ప్రభుత్వం మండల పరిధిలోని ముటుకుల గ్రామంలో రూ.16.90 కోట్లతో రక్షిత మంచినీటి ప్రాజెక్టును నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా యర్రగొండ పాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లోని 44 గ్రామాలకు నీరందించాల్సిఉంది. నిర్మాణంలో లోపాలు ,నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో పథకం మూన్నాళ్ళ ముచ్చటగానే మారింది. తరచూ పైప్‌లైన్ పగిలిపోవడం, పంపుల్లో సమస్యలు తలెత్తడం, ఫిల్టర్ బెడ్లులో ఆటంకాలు... అధికారుల అవినీతి, నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్ట్ పాలకులకు, ప్రజా ప్రతినిధులకు పాడి ఆవులా మారింది. పథకం ప్రారంభించి 15 సంవత్సరాలు పూర్తి అవుతున్నా రక్షిత జలాల సరఫరా నామమాత్రంగానే సాగుతోంది.

నిర్వహణ పేరుతో కోట్ల వ్యయం

తరచూ మరమ్మతులకు గురవుతున్న ఈ పథకానికి నిర్వహణ పేరుతో కాంట్రాక్టర్లుకు కాసుల వర్షం కురుస్తోంది. ఇప్పటికే కోట్ల రూపాయలు నిర్వహణ, వేతనాలకే ఖర్చు చేసినట్లుగా నివేదికలు చెబుతున్నాయి.

అసలేం జరిగింది..

2008లో నిర్మించిన ఈ పథకం లోపాల పుట్టగా మారింది. ఈ లోపాలపై అప్పటి యర్రగొండపాలెం ఎమ్మెల్యే ,ప్రస్తుత మంత్రి ఆదిమూలపు సురేష్ పాదయాత్ర చేశారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. ప్రాజెక్టును సందర్శించి జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని అప్పట్లో డిమాండ్ చేశారు. పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్న ఆయన అధికారుల పాత్రపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఆయనే మంత్రిగా ఉన్నా ఈ ప్రాజెక్టు నుంచి పట్టుమని పది గ్రామాలకు కూడా నీరు సరఫరా కావడం లేదు.

నీటిని కొలుగోలు చేస్తేనే దాహార్తి తీరేది..

ప్రజలు మినరల్ వాటర్‌ను ఒక్కో బబుల్‌ను రూ. 10 కొనుగోలు చేసి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. స్వచ్ఛ నీరు ఉద్దేశంతో తప్పని పరిస్థితుల్లో వాటర్ ప్లాంట్ల ద్వారా పేదలు, అన్ని వర్గాల ప్రజలు నీటిని కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఉన్నతాధికారులు ప్రాజెక్టుపై లోతైన విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. శాశ్వతంగా నీటి సమస్య పరిష్కరించి, ప్రాజెక్టులో చోటు చేసుకున్న అవినీతిని వెలికితీసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ముళ్ల చెట్లు తొలగింపు

వజాశక్తి-యర్రగొండపాలెం

పెద్దారవీడు మండలం కుంట నుంచి యర్రగొండపాలెం మండలం అమానిగూడిపాడు గ్రామం వరకూ రోడ్డుకు ఇరువైపుల ముళ్ళచెట్లతో రహదారి మూసుకు పోయింది. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అమానిగుడిపాడుకు చెందిన వైసిపి నాయకులు ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దష్టికి తీపుకెళ్లారు. స్పందించిన మంత్రి సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సొంత నిధులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను జెసిబితో ముళ్ల తొలగించే పనులు శుక్రవారం ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దేశభక్తి ప్రచార వారోత్సవాలు

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్లలోని స్పందన హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక మండలశాఖ ఆధ్వర్యంలో దేశ భక్తి ప్రచార వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర నాయకులు పి.స్వరూప రెడ్డి మాట్లాడుతూ దేశభక్తి అంటే దేశంలోని ప్రజలందరినీ ప్రేమించడం, అన్నదమ్ముల వలే కలసి జీవించడం, మంచిని పెంచడానికి కషి చేయడమేనని తెలిపారు. జెవివి జిల్లా అధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దక్పథంతో పాటుగా సామాజిక స్పృహను, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. స్వాతంత్ర సమరయోధులు, దేశనాయకుల చరిత్ర గురించి తెలు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో

మాట్లాడుతున్న జెవివి ప్రధాన కార్యదర్శి సుదీర్ కుమార్ రెడ్డి

జెవివి గిద్దలూరు మండల నాయకుడు డి.వెంకటేశ్వర్లు, రాచర్ల మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఖాజావలి, ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్ రెడ్డి, కార్యదర్శి మధుసూధన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దారుణం : ముత్తుముల

ప్రజాశక్తి - గిద్దలూరు

వైసిపి ప్రభుత్వ కుంభకోణాల నుంచి ప్రజలను దారి మళ్లించేందుకే టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించినట్లు టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సష్టించి అరాచక పాలన చేస్తున్నారని వైసిపి ప్రభుత్వంపై ఆయన విరుచుకుపడ్డాడు. చంద్రబాబు అరెస్ట్‌ను ఖండిస్తూ 10వ రోజూ శుక్రవారం బిసి సంఘం నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వారికి సంఘీభావం తెలిపి అశోక్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దోచుకోవటమే పనిగా పెట్టుకున్న జగన్ రెడ్డి తాను చేసిన ఇసుక, మద్యం, గంజాయి స్కామ్‌లను పక్కదారి పట్టించేందుకే అక్రమాలకు పాల్పడుతూ ఎలాంటి ఆధారాలు లేకున్న అధికారాన్ని అడ్డం పెట్టుకొని చంద్రబాబును ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బీసీల సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేస్తే, వైసీపీ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచి చేతి వత్తుల వారిని రోడ్డుపాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు బైలడుగు బాలయ్య యాదవ్, పార్లమెంట్ నాయకులు కేతం శ్రీనివాసులు, ఆరెపల్లె మల్లిఖార్జున, బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, రమణ, నంది శ్రీను పాల్గొన్నారు **మార్కాపురం :** మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ పొదిలి మండల, పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక కరెంట్ ఆఫీస్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా 2 లక్షల మంది విద్యార్థులకు పైగా నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అందులో దాదాపు 85,000 మంది పైగా విద్యార్థులు వివిధ ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం కుట్ర కుతంత్రాలతో చంద్రబాబునాయుడును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అరెస్టు దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంఆ ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి విలయ తాండవం చేస్తుందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో లోకేష్ యువగళం పాదయాత్రకు, చంద్రబాబు సభలకు ప్రజలు తండోప తండాలుగా వస్తుంటే ఓర్వలేకనే చంద్రబాబుపై నిందలు మోపి అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. అరెస్టులకు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, నాయకులు డాక్టర్ మన్నె రవీంద్ర, చేకూరి సుబ్బారావు, ఏరువ మల్లికార్జునరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, శనగా నారాయణరెడ్డి, చిట్టేల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇస్మాయిల్, షేక్ వలి, గురిజేపల్లి జిలాని, తోటా మహేష్ నాయుడు, షేక్ జిలాని, చేకూరి ఆంజనేయులు, వడ్లమూడి లింగయ్య, గోళ్ల సుబ్బారావు, మెడబలిమి అచ్యుతరావు, లక్ష్మయ్య యూసుఫ్, షేక్ జిలాని, ప్రసాద్, మంత్రూ నాయక్, చెవుల అంజయ్య, షేక్ మాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంకణాల ఆంజ నేయులు,కంకణాల రమాదేవి

ఆదర్శ దంపతులు

పోరుబాట-పాదయాత్రలో భార్యాభర్తలు

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట- పాదయాత్రలో భార్యాభర్తలు కంకణాల రమాదేవి,కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ 14 రోజుల పాటు 300 కిలోమీటర్లు పాదయాత్రలో నడిచారు.

ప్రజాశక్తి- ఒంగోలు

వేశపోగు మోజెస్, వేశపోగు బాలకోటయ్య

పాదయాత్రలో అన్నదమ్ములు

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట- పాదయాత్రలో అన్నదమ్ములు వేశపోగు బాలకోటయ్య, వేశపోగు మోజెస్ పాల్గొన్నారు. బాల కోటయ్య 14 రోజుల పాటు 300 కిలోమీటర్లు పాదయాత్రలో నడిచాడు. ఆయన సోదరుడు వేశపోగు మోజెస్ వసతుల కమిటీలో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు.

ప్రజాశక్తి- ఒంగోలు

24న ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 24న ప్రజా ఆరోగ్య పరిరక్షణ సౌజన్యంతో శంకర కంటి ఆసుపత్రి రూరల్ హోప్ ఫౌండేషన్, అమెరికా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు ఎగ్జిక్యూటివ్ నాగబాబు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు, పెద్దలకు, వద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్స, భోజనం, వసతి సౌకర్యం ఉచితంగా శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, గుంటూరు వారు సమకూర్చనున్నట్లు తెలిపారు. ప్రయాణ సౌకర్యం ఉచితం అని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాస్, సీనియర్ నాయకుడు చెన్నయ్య, త్రిపురాంతకం మండల కార్యదర్శి బాణాల రామయ్య, ఎఐటియుసి నాయకులు ఆవుల యోగయ్య, వెంకట శివయ్య పాల్గొన్నారు.

నగదు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - గిద్దలూరు రూరల్

వినాయక చవితిని పురస్కరించుకుని మండల పరిధిలోని బురుజుపల్లి గ్రామంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. విజేతలకు సివిఆర్ ఫౌండేషన్ చైర్మన్, వైసిపి నాయకుడు చేరెడ్డి వెంకటేశ్వర రెడ్డి కుమారుడు చేరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.2 వేలు చొప్పున నగదు బహుతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చేరెడ్డి జయరామిరెడ్డి, దిలీప్,పాల్గొన్నారు.

జిపిఎస్ వద్దు, ఒపిఎస్ అమలు చేయాలంటున్న టీచర్లు

ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - అద్దంకి

అధికారంలోకి వచ్చిన వారంలోపు సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ విధానం అమల్లోకి తీసుకు వస్తామని చెప్పిన నేడు సిపిఎస్ రద్దు చేయకపోగా జిపిఎస్ అంటూ కొత్త బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకించారు. ఫ్యాప్టో పిలుపుతో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిపిఎస్ విధానం ఉపసంహరించుకొని ఓపిఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ ఆడిట్ కమిటీ కన్వీనర్ జె బాబురావు కోరారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని అన్నారు. దానిని ప్రభుత్వాలు తీసివేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలని యూటీఎఫ్ జనరల్ సెక్రెటరీ బి పూర్ణచంద్రరావు కోరారు. సీనియర్ నాయకులు సోమేపల్లి హనుమంతరావు, సర్వేశ్వరరావు, రమణారెడ్డి, గంగాధర్, రామారావు, జాషువా, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

చిట్టివాద భూములకు సాగునీరివ్వాలంటున్న రైతులు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రజశక్తి - చీరాల

దండుపాట రోడ్డులోని దరివాద, చిట్టివాద రైతులకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. పట్టణంలోని కారంచేడు గేటు వద్ద సాగునీటి కోసం రోడ్డు ఎక్కి రైతులు ఆందోళన చేశారు. పోలీస్ 30యాక్ట్ అమల్లో ఉన్నందున రోడ్డుపై ఆందోళనలు, ధర్నాలు చేస్తే అదుపులోకి తీసుకుంటామని సీఐ సోమశేఖర్ రైతులను హెచ్చరించారు. ఆందోళన చేస్తున్న రైతులను ఆ ప్రాంతం నుంచి పోలీసులు చెదరగొట్టారు. దీంతో రైతులు ఇరిగేషన్ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. సాగునీటి కోసం పంటలు ఎండుతున్నాయని ఆందోళన చేస్తున్న రైతులపై కేసులు పెడతామంటూ సీఐ సోమశేఖర్ బెదిరించిన తీరు దుర్మార్గమని రైతులు అన్నారు. తాము రాజకీయ నాయకులం కాదని, పంటలు ఎండుతున్నాయనే ఆవేదనతో తమ బాధలు చెప్పుకుంటున్నామని అన్నారు. నారు మడులు వేసుకుని నీటి కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. మూడు నెలలుగా ఇరిగేషన్ అధికారులు చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతోనే రోడ్డు ఎక్కాల్సి వచ్చిందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో నీళ్ల ఇవ్వాలని కోరారు. అనంతరం ఏఈ పవన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రావు, సుబ్బారావు, బాబురావు, జయరత్నం, వాసు, విమలాకర్, కృష్ణ పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మహిళ మృతి

మండలంలోని చావలి, బలిజేపల్లి గ్రామాల మధ్య ఉన్న వేమూరు సాగునీటి కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు. మృతురాలు 35నుండి 40సంవత్సరాలలోపు వయసు కలిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహంపై గులాబీ రంగు మీద పసుపు గళ్ళు కలిగిన చీర, పసుపు కలర్ జాకెట్ పైన గ్రీన్ కలర్ డిజైన్ కలిగిన ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తించినట్లైతే తమకు తెలియపర్చాలని కోరారు.

రోడ్లపైనే వర్షపు నీళ్లు.. పోయేదెలా?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలో నాలుగు మేజర్ పంచాయతీలు ఉన్నాయి. ఏ ఒక్క గ్రామంలో మురుగు నీటి పారుదల సౌకర్యం లేదు. కొద్దిపాటి వర్షానికి రహదారులు నీట మునుగుతున్నాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. మేజర్ పంచాయతీ భట్టిప్రోలులో గతంలో మురుగు నీటి పారుదలకు పక్కా డ్రైన్ నిర్మాణం చేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో ఉపయోగపడటం లేదు. ఐలవరం, వెల్లటూరు, పెదపులువరు గ్రామాలలో ఒక్క డ్రైన్ కూడా నిర్మించలేదు. ఐలవరంలో వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేక రహదారుల పైనే నిల్వ ఉంటున్నాయి. ప్రజలకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్నాయి. గ్రామంలో ప్రధాన రహదారైన లైబ్రరీ సెంటర్, శివాలయం సెంటర్,

కాలువలుగా మారిన రోడ్లు - ఇళ్లమధ్య వదలని వర్షపు నీళ్లు

భావన రుషి దేవస్థాన సమీపం నుండి సచివాలయానికి వెళ్లే మార్గంలో రామ మందిరం వరకు రోడ్డు వెంబడి డ్రైన్ లేకపోవడంతో వర్షపు నీటితో రహదారులు మునిగిపోయి ఉంటాయి. ఎంతమంది పాలకులు మారినా డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేవని గ్రామస్తులు వాపోతున్నారు. వెల్లటూరు ప్రధాన రహదారి కూడా కొద్దిపాటి వర్షానికే రహదారిపై మోకాలి లోతు నీరు నిలబడి రాకపోకలు ఇబ్బందిగా మారాయి. కృష్ణా నది పరివాహక లంక గ్రామాల నుండి కూడా ప్రజలు వివిధ పనులపై వెల్లటూరు నుండే వస్తూ ఉంటారు. ప్రభుత్వ వైద్యశాల నుండి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకు మొత్తం నీటితోనే నిండిపోయి ఉంటుంది. దీంతో చిరు వ్యాపారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెదపులివర్రులో కార్పొరేషన్ బ్యాంక్, రోహిణి రైస్ మిల్ ప్రాంతంలో రహదారుల పల్లంగా ఉండి వర్షపు నీరు నిలబడుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కనీసం మేజర్ పంచాయితీల్లోనైనా నీటిరుపాదులకు అనువుగా కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా ఆవులు

- గుంపులుగా తిరుగుతున్న వైనం
- అల్లాడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో రోడ్లపై హల్ చేస్తున్న ఆవులను చూస్తుంటే వాహన దారులు ప్రమాద భయంతో వెళ్లాల్సి వస్తుంది. పట్టణ ప్రధాన కూడళ్లలో, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఆవులు సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ప్రధానంగా కూరగాయల మార్కెట్ సెంటర్, గడియార స్తంభం, ఎన్ఆర్ అండ్ పిఎం హై స్కూల్ గ్రౌండ్, పేరాల సెంటర్ వంటి ప్రాంతాలలో పగలు రాత్రి తేడా లేకుండ గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఆవులు అధిక సంఖ్యలో తిరుగుతూ ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గతంలోనూ

రోడ్డుకు అడ్డంగా నిలిచిన ఆవుల మంద

ఇదే తరహా పట్టణ ప్రజల ఎదుర్కొన్నప్పటికీ అప్పటి అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టారు. పట్టణంలో సంచరిస్తున్న ఆవులకు మున్సిపల్ అధికారులు దొడ్డిని ఏర్పాటు చేశారు. వాటి ఆలన పాలన మున్సిపల్ అధికారులే పర్యవేక్షించారు. ఆవుల యజమానులను పిలిచి హెచ్చరించారు. రోడ్లపై వదిలేస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. దీంతో అప్పట్లో కొంతమేరకు రోడ్లపై ఆవుల సంచారం తగ్గింది. మరల యధావిధిగా ఆవులను రోడ్లపై వదిలేశారు. ఆవుల బెడద ఎక్కువ అవటంతో బాటసారులు, వాహనదారులు, దుకాణాదారులకు నిత్యం ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణ అభివృద్ధిపై అహర్నిశలు కృషి చేస్తున్నామంటున్న మున్సిపల్ అధికారులు ఇటువంటి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజల కోరుతున్నారు. గతంలో ఉన్న గో సంరక్షణ కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతున్నారు. ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మార్కా'పుర'ంలో... కుక్కల స్వైర విహారం ..!

భయాందోళనలో ప్రజానీకం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా కుక్కల మంద కనిపిస్తోంది. కుక్కల బెడదతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చిన్నారులపై తరచూ దాడులు చేస్తూనే ఉన్నాయి. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపలేని పరిస్థితిలో తల్లిదండ్రులు ఉన్నారు. కుక్కల బెడద నివారించాలని మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో కౌన్సిలర్లు చర్చించగా అప్పటికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు ప్రకటించడమే కానీ నివారణ సాధ్యం కావడం లేదు.

మార్కాపురంలోని కాలేజి రోడ్డులో కొన్ని కుక్కలు రాత్రివేళ వాహనాలు వేగంగా వెళుతుండగా కుక్కలు కూడా వాహనాలతో పరుగెత్తుతున్నాయి. కంభం రోడ్డులో గల శ్రీనివాస థియేట్ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి ఉంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఎక్కడ కుక్కలు కరుస్తాయోనని వేగం పెంచి తప్పించుకోవాల్సి వస్తోంది. కుక్కలు వేటాడే సమయంలో కొందరు వాహనాల మీద నుంచి క్రిందపడి ప్రమాదానికి గురైన సంఘటనలు

పట్టణంలో కుక్కల స్వైర విహారంతో ప్రజల బెంబేలు

లేకపోలేదు. ఒక్కో వీధిలో 50కి తక్కువ లేకుండా కుక్కలు ఉన్నాయి. పట్టణం అంతటా లెక్కిస్తే వేలల్లోనే ఉంటాయి. కుక్కల దాడితో గాయపడిన క్షతగాత్రులు వ్యాక్సిన్ కోసం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. తగినంతగా వ్యాక్సిన్ అందుబాటులో లేక పలువురు ఇబ్బందులు పడుతున్నారు. బయట మార్కెట్‌లో వ్యాక్సిన్ కొనుగోలు చేయాలంటే రూ.500వరకు ఉంటుంది. ఈ విధంగా ఖచ్చితంగా ఐదు టీకాలు వేయించుకోవాలి. పేదలకు ఆర్థిక భారం కావడంతో ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్న సమయంలో వెళ్లి టీకాలు వేయించుకోక తప్పడం లేదు. ఒక వీధి కుక్క మరో వీధిలోకి వస్తే స్థానికంగా సంచరిస్తున్న కుక్కలన్నీ కలిసి ఆ కుక్కను తరుముకునే పనిలో ఉంటాయి. కుక్కల మంద రహదారులపై అడ్డదిడ్డంగా పరుగెత్తడం ప్రమాదాలు తలెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం మొక్కుబడిగా అక్కడక్కడ కుక్కలు కొన్నింటిని పట్టుకొని అడవిలో వదిలేస్తున్నారు. కుక్కలను పట్టుకుంటున్నారని జంతు ప్రేమికుల్లో ఓ వ్యక్తి బ్లూ క్రాస్‌ను ఆశ్రయించాడనే కారణంతో కుక్కలను పట్టడం లేదని అధికారుల చెబుతున్నారు. కుక్కలను పట్టుకోలేక పోయినప్పుడు వాటి ఉత్పత్తి తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కానీ ఇక్కడి అధికారులు ఆ ప్రయత్నంలో లేరు. ఇలాగే వదిలేస్తే బయటకు రాలేని స్థితి దాపురిస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుక్కల నివారణకు సరైన మార్గం కు.ని. ఒక్కటేనని, ఆ దిశగా మున్సిపల్ అధికారులు సంబంధిత పశు వైద్యాధికారులతో సంప్రదించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనాలు

ప్రజాశక్తి - చీరాల

వినాయక చవితి సందర్భంగా పందిళ్లలో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. వాడరేవు సముద్ర తీరానికి భారీగా విగ్రహాలు తరలి వెళ్లాయి. తీరంలో భక్తుల కోలాహలం కనిపించింది.

గణేష్ నగరోత్సవంలో న్యాయవాది రమేష్

యువకులు జైబోలో గణేష్ మహరాజ్‌కి అంటూ వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. పేరాల మహాలక్ష్మి చెట్టు వద్ద రాపిడ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు అన్ని రకాల జాగ్రత్తలతో ప్రత్యేక పూజలు అనంతరం మేళతాళాలతో ర్యాలీగా పట్టణ పురవీధులలో వినాయక విగ్రహ నగరోత్సవం నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల

పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8 నుండి 22వరకు ఎంఆర్పిఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చివరి రోజు శుక్రవారంతో ముగిశయ ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్చార్జి వర్ల దేవదాసు మాదిగ తెలిపారు. కార్యక్రమంలో

ఎంఆర్‌పిఎస్ కార్యకర్తల నిరసన

ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య, పట్టణ కన్వీనర్ తాళ్లూరు రాజేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ దుడ్డు వందనం, మండల ఇన్చార్జి మల్లవరపు గాంధీ, మాసిపోగు వేణు, వేమూరి నియోజకవర్గ ఇన్చార్జి దాసు, సాగర్, రాకేష్, చక్రవర్తి, ఏసు పాదం, నవీన్, సునీల్, మరియదాసు, దుడ్డు రాంబాబు, ఏసురత్నం, బాబు, మోషే, అమ్మి, మున్నా, రవీంద్ర, ఆంటోనీ, కిషోర్, అనిల్ పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో నిరసన దీక్షలు

- కారంచేడులో అంబేద్కర్ ఫొటోతో నిరసన
- వేమూరు దీక్షల్లో మాజీ మంత్రి ఆనందబాబు
- బాపట్ల టిడిపి నేతలపై కేసు నమోదు

చీరాల దీక్షల్లో ఎంఎం కొండయ్య

వేమూరు దీక్షల్లో నక్కా ఆనందబాబు

రేపల్లెలో టిడిపి నేతల దీక్షలు

ప్రజాశక్తి -కారంచేడు

చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ పర్చూరు ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో దీక్షలు 14వ రోజుకు చేరాయి. స్థానిక టిడిపి కార్యాలయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సిఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న రాజారెడ్డి రాజ్యాంగం పోయి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి ఇచ్చిన రాజ్యాంగం కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, పోతిన వెంకటేశ్వర్లు, తాళ్లూరి అనిల్ కుమార్, షేక్ కాలిషావలి, కొల్లా భాస్కరరావు, గద్దె సబ్బయ్య పాల్గొన్నారు.

రేపల్లె : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని, కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకు సాగాలని టీడీపీ పట్టణ అధ్యక్షులు జీపీ రామారావు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలు 8వ రోజు కొనసాగాయి. ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ క్లస్టర్ యూనిట్ సభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కుట్ర, కక్షపూరిత రాజకీయాలపై ప్రజలు ఐక్య పోరాటం చేయాలని అన్నారు. కార్యక్రమంలో అనగాని శివ ప్రసాద్, దేవగిరి రవి, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, ధర్మతేజ పాల్గొన్నారు.

భట్టిప్రోలు (వేమూరు) : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శుక్రవారం నిరాహార దీక్ష చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నిరాహార దీక్షలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడారు. అరెస్టును ఖండించారు. అనంతరం దీక్షపరులకు నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, మైనేని మురళీకృష్ణ, మధుసూదన్ ప్రసాద్ పాల్గొన్నారు.

అద్దంకి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని రామాటాకీస్ వద్ద ఎస్సీ సెల్ అధ్వర్యంలో 10వరోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలో దళిత మహిళను మొట్టమొదటి సారి స్పీకర్‌ను చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. 27దళిత సంక్షేమ పదకాలు రద్దుచేసి, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను మళ్ళించిన జగన్ ఏవిధంగా దళిత పక్షపాతని ప్రశ్నించారు. ఎన్నడూలేని విధంగా ఈ ప్రభుత్వంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. అంబేద్కర్ విదేశీ విద్యారుణం పదకానికి జగన్‌పేరు పెట్టుకుంటే వైసిపి దళిత నేతలు ఎందుకు ప్రశ్నించలేదని అన్నారు. కార్యక్రమంలో స్టాలిన్ మాస్టర్, ఎస్సీ సెల్ అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు, అన్నంగి మనోహరమ్మ, సామ్యేలు, తెలగతోటి కొండమ్మ, భౌజంకు నాగరాజు, అంకం నాగరాజు, అమర్తపూడి చిన్న, మందా నాగేశ్వరరావు, మందా అమోస్, తెలగతోటి బాలు పాల్గొన్నారు.

చీరాల : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇన్చార్జ్ ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో బైపాస్‌లోని టిడిపి నూతన కార్యాలయంలో చేస్తున్న దీక్షలు శుక్రవారంకు 10వ రోజుకు చేరుకున్నాయి. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం దీక్షలను ప్రారంభించారు. చంద్రబాబుకు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతో జగన్ ఉద్దేశ్యంపూర్వకంగా స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు చేశారని అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారని ఆరోపించారు. సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. దీక్షలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, ఉసురుపాటి సురేష్, కొండ్రు రత్నబాబు, షేక్ మొహిద్దీన్, లావేటి శ్రీనివాస తేజ, జడ్డు శ్రీహరి, నరాల తిరుపతి రాయుడు, దగ్గుబాటి వెంకట్రావు, సిపాలశెట్టి హరికృష్ణ, కుంచాల రామాంజనేయులు, షేక్ లాల్ అహ్మద్, కౌతరపు నాగేశ్వరి, శింగిరేసు కాళిదాస్, పఠాన్ ఆయుబ్, కొమ్మూరి మహేంద్ర బాబు, పలగర్ల శ్రావణ్, రాసాల శ్రీనివాస్, పాకాల సత్యనారాయణ, గుంటూరు మనోహర్, షేక్ సద్దాం హుస్సేన్, షేక్ రజాక్ పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అన్నదానం

ప్రజాశక్తి - బాపట్ల

గణేష్ నవరాత్రుల సందర్భంగా పాత బస్టాండ్ సెంటర్లో ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బుచ్చిరాజు, ఆటో డ్రైవర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న నరేంద్రవర్మ

పౌష్టికాహారం ప్రాముఖ్యత వివరిస్తున్న ఐసిడిఎస్ పూర్వైజర్

పౌష్టికాహార మహోత్సవాలు

ప్రజాశక్తి - పర్చూరు

పౌష్టికాహార మహోత్సవాల్లో భాగంగా స్టాల్స్ నిర్వహించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యత, పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను గురించి వివరించారు. గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవలసిన ఆహార పదార్థాలను వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యత చెప్పారు. సుపోషిత భారత్, సాక్షర భారత్, స్వశక్తి భారత్ దిశగా అడుగులు వేయాలని సిడిపిఒ సుభద్ర కోరారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎం అన్నపూర్ణ, పి దీపాదేవి, ఎం రాధా, యద్దనపూడి సూపర్వైజర్ సిహెచ్ సుజాత, మార్టూరు సూపర్వైజర్లు కె పద్మావతి, డి శిరీష పాల్గొన్నారు.

పంచాయితీలో పెట్టిన బోనులో పట్టుబడ్డ వీధి కుక్కలు

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

గ్రామాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను మండలంలోని గుంటుపల్లి సర్పంచ్ మాదాల కృష్ణకుమారి, శివన్నారాయణ ఆధ్వర్యంలో గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాల్లో వీధి కుక్కలను కార్మికులు చేత బంధించి బోనులు పెట్టి బంధించారు. పట్టుకున్న వీధి కుక్కలను అడవుల్లో వదిలిపెడతామని తెలిపారు. వాహన చోదకులు, పిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడిచేసి గాయపరుస్తున్నాయని ప్రజల పిర్యాదుతో వీధి కుక్కలను బంధించారు. దీనిపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సమావేశంలో 98డిఎస్‌సి అభ్యర్థులు

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

ప్రజశక్తి - చీరాల

1998 డిఎస్సిలో క్వాలీఫై అయిన ఉద్యోగాల ఎంపికలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ అభ్యర్థులకు ఉద్యోగాలు రాక తీవ్ర అన్యాయం జరిగిందని డియస్సి అభ్యర్థులు ఆరోపించారు. పట్టణంలోని పాపరాజుతోట భాపనమ్మ కళ్యాణ మండపంలో జగనన్నకు విన్నపం అనే అంశంపై డీఎస్సీ అభ్యర్థులు విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఉద్యోగాలకు క్వాలిఫై అయి దశాబ్ద కాలం పోరాట ఫలితంగా సీఎం జగన్మోహన్ రెడ్డి ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు. తొలుత సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరిగిన 6800 మందికి ఉద్యోగాలు ఇస్తామంటూ హామీ ఇచ్చిన జగన్ కేవలం 4072ఉద్యోగాలు ఇవ్వడంతో అర్హత ఉండి కూడా 2300 మంది రోడ్డున పడిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే 726 మందికి ఉద్యోగాలు రావాల్సి ఉండగా 506 మందికే వచ్చాయని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి డీఎస్సీ 98లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రత్నబాబు, సత్యం, రవి, మనోజ్, కటారి అంజయ్య, వీరాస్వామి, సాయి గీత, సుహాసిని, లక్ష్మీ జానకి, కరుణ కుమారి పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- ప్రజలు రోగాలతో మంచం ఎక్కుతున్నారు
- గ్రామాల్లో కనిపించని పారిశుధ్యం
- జీతాలు లేక ఇబ్బంది పడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలో పారిశుధ్యం పడకేసింది. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే మురుగునీరు నిలిచిపోతుంది. వర్షం నీరు రోజులు తరబడి నిల్వ ఉంటుంది. దీంతో దోమలు పెరుగుతున్నాయి. దోమకాటుతో ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారు. దోమలు, ఈగల మోతకు ప్రజలు బెంబేలెత్తు తున్నారు. మండలంలో 60వేలపైగా జనాభా నివసిస్తున్నారు. అధికారుల పని తీరు గ్రామాల్లో పారిశుధ్యం చూస్తే అర్థమవుతుందని గ్రామస్తులు అంటున్నారు. రోడ్డు మీదకు వెళ్ళాలంటే భయపడే వాతావరణం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాల బారిన పడిన వారికి ఎప్పటికప్పుడు వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యులు కూడా పట్టించుకోకపోతే ఏమైపోతామోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయితీలో పేరుకుపోయిన చెత్త, చెదారం

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

గ్రామాలలో వైరల్ ఫివర్‌తో పాటు డెంగీ బెడద రోజురోజుకు తీవ్రమ వుతోంది. రాత్రి, పగలు దోమలు కుట్టడంతో వ్యాధులు పెరుగుతున్నాయి. దోమల నియంత్రణ, చెత్త తొలగింపులో పారిశుధ్య విభాగం నిర్లక్ష్యంగా ఉంది. ఫాగింగ్, స్ప్రేలు, బ్లీచింగ్ చేయడంలో పంచాయతీ అధికారులు విఫలమయ్యా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటింటికి స్ప్రేలు చేయాలని ప్రణాళిక చేసినప్పటికీ నామ మాత్రంగానే నిర్వహిస్తు న్నారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ పనులు చేయడంలో అధికారు లకు లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

గ్రీన్ అంబాసిడర్లలు ఎక్కడ?

మండలంలో గ్రీన్ అంబాసిడర్లను పంచాయతీ అధికారులు నియమించారు. అయితే గ్రీన్ అంబాసిడర్లకు నెలలు తరబడి జీతాలు ఇవ్వడం లేదు. దీంతో పారిశుధ్యం పడకేసింది. అధికారులను వివరణ కోరగా ఎటువంటి నిధులు లేవని పంచాయతీ కార్యదర్శులు అంటున్నారు. ఉన్నతాధకారులు స్పందించి చర్యలు తెసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛత ఉంటేనే ఆరోగ్యం

ప్రజాశక్తి - వేటపాలెం

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో చింతల రుతమ్మ అన్నారు. మండలంలోని దేశాయిపేటలో స్వచ్ఛత హైసేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు గ్రామాలలోని అన్ని వీధులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి రెండు బావులు కలిగిన మరుగుదొడ్లు తప్పనిసరని అన్నారు. సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ చూపరులను ఆకట్టుకుంది. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రత్యేక అధికారి రామ్ కుమార్, ఈఓఆర్డి సజ్జ శ్రీలక్ష్మి, సెక్రటరీ శ్రీనివాసరావు, గుమస్తా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్య అవగాహన ర్యాలీలో ఎంపిడిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఇఒఆర్‌డి ఆర్ రమేష్ బాబు

ఆరోగ్య సురక్షపై ఇంటింటి సర్వే

ప్రజాశక్తి - కారంచేడు

జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై వాలంటీర్లతో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈఓఆర్డి ఆర్ రమేష్ బాబు మాట్లాడుతూ గ్రామంలోని వాలంటీర్లందరూ ఇంటింటికి తిరిగి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్య సురక్ష యాప్‌ని గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి యజమాని సెల్ ఫోన్‌లో డౌన్లోడ్ చేయాలని చెప్పారు. ఈనెల 27న గ్రామంలో మెడికల్ క్యాంపు జరుగుతుందని తెలిపారు. ప్రజల అనారోగ్య సమస్యలకు ఈ మెడికల్ క్యాంపులో ఉచితంగా పరీక్షల నిర్వహించి వైద్యం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజయ్య, మాధవి, రాజకుమార్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర్ తెలిపారు. ఎంపీపీ డివి లలిత కుమారి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఆయా గ్రామాల ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

కెవిపాలెంలో రోడ్డులో సాగర్ కాలువపై

నూతన బ్రిడ్జి నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండల పరిధిలోని కెవిపాలెం రోడ్డులో సాగర్ కాలువపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్తకు చేరిందని, దాని స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని సిపిఎం పోరుబాట-పాదయాత్ర బృందం డిమాండ్ చేసింది. జిల్లా అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట-పాదయాత్ర బృందం మండలంలో శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా కెవిపాలెం రోడ్డులోని బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బ్రిడ్జి శిథిలావస్థకు చేరి కూలే స్థితిలో ఉందన్నారు. ప్రజలు సమస్యను అనేక సార్లు విన్నవించినా అధికారులు,ప్రజాప్రతి నిధులు పట్టించు కోలేదన్నారు. అనంతరం సూర్యనగర్ కాలనీని సందర్శించారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని, పైపులైను వేసి మంచినీటి వసతి కల్పించాలని పాదయాత్ర బృందం డిమాండ్ చేశారు. అనంతరం చీమకుర్తికి పాదయాత్ర చేరింది. చీమకుర్తిలో శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పాదయాత్ర సందర్భంగా గుర్తించిన ప్రజా సమస్యలపై నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ధర్నాలో సిపిఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పాదయాత్ర చీమలమర్రి మీదుగా సంతనూతలపాడుకు చేరింది. పాద యాత్రలో జివి.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, వెల్లంపల్లి ఆంజనేయులు, కె.రమాదేవి, పి. కల్పన, బి. రఘురామ్, వి. బాలకోటయ్య, డికెఎం.రఫి, కె. మాల్యాద్రి, సిహెచ్. వినోద్, సిపిఎం మండల కార్యదర్శి పూనపాటి వెంకటరావు, నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, తొట్టెంపూడి రామారావు, పులి ఓబులరెడ్డి, బి.వీరాంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, కొండయ్య పాల్గొన్నారు.

డ్యామ్‌లు ఉన్నా..

నీటి కష్టాలు తప్పడం లేదు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంతనూతలపాడు నియోజక వర్గంలో రెండు డ్యామ్‌లు ఉన్నా ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదని, పంట పొలాలకు చుక్క నీరు అందడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు తెలిపారు. సిపిఎం పోరుబాట పాదయాత్ర 13వ రోజు శుక్రవారం సంతనూతలపాడుకు చేరింది. పాదయాత్ర బృందానికి మైనంపాడు డొంక వద్ద గ్రామ సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్ర పోలీస్ స్టేషన్ సెంటర్ మీదుగా మద్దులూరు బస్టాండ్ సెంటర్, స్టేట్ బ్యాంక్ సెంటర్, బస్టాండ్ సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ గత 13 రోజులుగా పాదయాత్ర బృందం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. మండల కేంద్రమైన సంతనూతలపాడులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వారానికి ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఆ నీరు కూడా కలుషితంగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని దుయ్యబట్టారు. ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సాగునీరు ఇచ్చి పంటలు పండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో రాజకీయ దురాహంకారంతో పాలన సాగుతుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే వారిపై పాలకులు ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ప్రజాసమస్యలు పట్టించుకోకుండా పోరాడుతున్న వారిపై బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ప్రకాశం జిల్లా పేరులోనే ప్రకాశం ఉందని, ప్రజల జీవితాల్లో ఎలాంటి ప్రకాశం లేదని తెలిపారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని తెలిపారు. నిత్యావసర ధరలు ఆకాశానంటుతున్న నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందా యన్నారు. విద్య ,వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. ప్రజలపై అనేక రకాల భారాలు మోపుతున్నారన్నారు. ప్రజా పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతా యన్నారు. ప్రజా పోరాటాల ద్వారానే పోగాకు బోర్డు, మార్కెట్ యార్డు సాధించ ుకున్నామన్నారు. మండలంలోని అనేక ప్రాంతాల్లో పోరాటం ద్వారా పేదలకు నివాస గృహాలు, పట్టదారు పాస్ పుస్తకాలు సాధించుకున్నట్లు తెలిపారు. సంతనూతలపాడులో దళిత రైతులు దేవాదాయ భూములు కౌలుకు తీసుకొని సాగునీరు లేక పంటలు వేయలేదని, ఈ నేపథ్యంలో కౌలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నేడు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో మండల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పాదయాత్ర బృందానికి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. పాద యాత్రలో వి. బాల కోటయ్య, వి. ఆంజనేయులు, బి.రఘురాం, కె.రమాదేవి, పి.కల్పన, సిహెచ్.వినోద్, కె.మాల్యాద్రి, డిఎంకె. రఫీ, మండల నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, కిలారి పెద్దబ్బాయి, షేక్ మస్తాన్, అద్దంకి భగత్ సింగ్,కరిచేటి హనుమంతరావు, బి.పద్మ ,మాలతి, ఎం.సుబ్రహ్మణ్యం ,పి. శ్రీమన్నారాయణ ,ఎం. శ్రీను ,టి.ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలో సిపిఎం నాయకులు

చెత్త పోసి ప్రాణాలు తీస్తారా..?

- కార్పొరేషన్ అధికారులపై చేపల మార్కెట్ వ్యాపారుల ఆగ్రహం
- ఊరచెరువులో చెత్త డంప్‌ను నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

'ఊర్లో చెత్త అంతా తెచ్చి ఇక్కడ పోస్తున్నారు. ఆచెత్త నుంచి వచ్చే దుర్వాసన, పొగకు మా ప్రాణాలు పోతున్నాయి. చెత్తపోసి మా ప్రాణాలు తీస్తారా...?'అంటూ స్థానిక ఊరచెరువులోని చేపల మార్కెట్ వ్యాపారులు, కార్మికులు ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊరచెరువులో చెత్తను డంప్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. అక్కడ చెత్తను డంప్ చేసేందుకు వచ్చిన ఆటోలను అడ్డుకొని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జీ, డిఇఇ గణపతి అక్కడికి చేరుకున్నారు. కొత్తగా గార్బేజ్ ట్రాన్సఫర్ స్టేషన్ను రెండు నిర్మాణంలో ఉన్నాయని, అవి త్వరలోనే పూర్తి అవుతాయని, ఆ తరువాత ఊరచెరువులో చెత్త డంప్ చేయమని చేపల మార్కెట్ వ్యాపారులకు నచ్చజెప్పారు. ఏరోజు చెత్త ఆరోజు అక్కడ నుంచి లిఫ్ట్ చేసి గుత్తికొండవారిపాలెం డంప్ యార్డుకు తరలిస్తున్నామని, ఇటీవల కొన్ని వాహనాలకు మరమ్మతుల కారణంగా కొంత చెత్త పోగుపడిన మాట వాస్తమని, ఇకమీదట అలాంటి పొరబాటు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల మాటలను చేపల వ్యాపారులు వినలేదు. చెత్తను అక్కడ డంప్ చేస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు. చెత్తను అక్కడ డంప్ చేయడం, తగులబెట్టడం వల్ల తమకు రోగాలు వస్తున్నాయని, వ్యాధులతో కొంతమంది చనిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేపల మార్కెట్‌లో తమ అవసరాలకు నీరు అందుబాటులో లేదని, మురుగు కాలువలు సక్రమంగా లేవని, చేపలు తొముకునేందుకు షెడ్లు లేవని, తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈలోపు విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ అక్కడికి చేరుకున్నారు. వ్యాపారులతో చర్చలు జరిపారు. అక్కడ చెత్త పోయకుండా చర్యలు తీసుకుంటానని, ఈవిషయంపై కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నిరోజుల్లో సమస్యను పరిష్కరిస్తారో చెప్పాలని వ్యాపారులు పట్టుబట్టారు. ఈవిషయంపై కార్పొరేషన్ అధికారులతో చర్చలు జరిపిన కార్పొరేటర్ వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ హామీతో వ్యాపారులు తమ ఆందోళనను విరమించారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తామని చేపల మార్కెట్ వ్యాపారులు స్పష్టం చేశారు.

ఆందోళన చేస్తున్న చేపల మార్కెట్ వ్యాపారులు ,కార్మికులు

పారిశుధ్యంపై అవగాహన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పారిశుధ్యంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో ప్రయాణికులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పారిశుధ్యం ప్రాము ఖ్యతను తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం డిపో సమీపంలోని వ్యాపారుస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. చెత్తను ఎవరూ బయట వేయకూడదని, డస్ట్‌బిన్‌లో వేసి నగరపాలక సంస్థ ఆటోలకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎస్. పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జీ, మిరియం శ్రీను, వెంకటేశ్వర్లు, డిఇఇ గణపతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కమిషనర్

యెహోవా భక్తుల మరణం
ఆయన దృష్టికి విలువగలది, కీర్తన: 116:15
జ్ఞాపకార్థ కూటము.

జీవితాంతం మాకోసం శ్రమించావు
మా ఉన్నతి కోసం పాటుపడ్డావు
నీవు లేవన్న నిజం ఇప్పటికి మేము నమ్మలేకపోతున్నాం
"అట్లూరి సంపూర్ణమ్మ" నిన్ను మర్చిపోలేకున్నాం.
నిరంతరం నీ జ్ఞాపకాలని స్మరించుకుంటూ.....
కీ॥శే॥ అట్లూరి సంపూర్ణమ్మ గారు
పంగులూరు, బాపట్ల జిల్లా
భర్త : అట్లూరి లాజరు.
మరియు కుటుంబ సభ్యులు.